సీనియర్ న్యాయవాది ఇరుగు గురుస్వామి మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రముఖ సీనియర్ న్యాయవాది ఇరుగు గురుస్వామి అనారోగ్య కారణాలతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. న్యాయవాదిగా తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకున్న ఇరుగు గురుస్వామి మృతి పట్ల తిరుపతి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఇరుగు గురుస్వామి గత 40 సంవత్సరాలుగా న్యాయవాది వత్తిలో ఉంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, పలు సంస్థలకు న్యాయ సలహాదారుడుగా పనిచేశారు. శనివారం ఆయన స్వగ్రామమైన పాకాల మండలం గాదంకి సమీపంలోని గుడివారిపల్లెలో అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఐలు నాయకులు మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సంతాపం ప్రకటించారు.

వెంకటగిరికి 'వరాలు'

పోలేరమ్మ జాతరకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

- ఆళ్తూర్‌పాడు ప్రాజెక్టుకు రూ.530 కోట్లు
- నేతన్నలకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి హామీ
- వెంకటగిరి ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.20 కోట్లు
- అట్టహాసంగా నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, వెంకటగిరి

చేనేతకు ప్రపంచ గుర్తింపు తెచ్చింది వెంకటగిరి.. ఆ ఊరికి సిఎం జగన్మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. తిరుపతి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి ఇన్‌ఛార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి కోరిక మేరకు వెంకటగిరికి సిఎం విచ్చేసి నీటి ప్రాజెక్టులకు నిధులు ప్రకటించారు. అళ్తూరుపాడు ప్రాజెక్టు నిర్మాణానికి రూ.530 కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. అలాగే వెంకటగిరి ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.20 కోట్లు ఇస్తానని ప్రకటించారు. నేతన్నలకు కమ్యూనిటీ హాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికి 50 లక్షలు కేటాయిస్తూ సిసి రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ, నేతన్న నేస్తం కార్యక్రమాలు వెంకటగిరిలో అట్టహాసంగా జరిగాయి.

శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో 'నేతన్న నేస్తం' నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంకటగిరి బహిరంగ సభలో పాల్గొని బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. పట్నం రమేష్ నేతన్న కుటుంబంతో కలిసి మగ్గం నేశారు. తరువాత నేతన్నలతో గ్రూప్ ఫోటో తీసుకున్నారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాలర్పించారు. కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి స్వాగత ఉపన్యాసంలో మాట్లాడుతూ నేతన్న నేస్తం 5 వ విడత శ్రీకార కార్యక్రమానికి వెంకటగిరి కి రావడం సతోషంగా వుందని అన్నారు. నేతన్న నేస్తం పథకంతో ప్రతి ఏటా రూ.24 వేలు అర్హత గల కుటుంబాలకు అందుతుండటంతో చేనేత రంగం పుంజుకున్నదని అన్నారు. వెంకటగిరి నేతన్నలు దాదాపు 10 మంది రాష్ట్రపతి అవార్డులు అందుకున్న వారు వున్నారని అన్నారు.

తిరుపతి జిల్లాలో చేనేత, జౌళి శాఖ సంబంధించి సుమారు 4250 మంది మగ్గము కలిగిన చేనేత కార్మికులు ఉన్నారని ప్రత్యక్షంగా పరోక్షంగా 15475 మంది జీవనం సాగిస్తున్నారని అన్నారు. తిరుపతి జిల్లాలో వెంకటగిరి కాటన్, సిల్క్, జరీ చీరలు , శ్రీకాళహస్తి చేనేత, కలంకారి ఉత్పత్తులు , నారాయణవనం చీరలు, చెన్నూర్ కాటన్ చీరలు రాష్ట్రంలోనే కాక దేశ విదేశాలలోనూ ప్రఖ్యాతి చెందింది అన్నారు. చేనేత పరిశ్రమ నందు శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం కొరకు పదవ తరగతి పాసయిన వారికి చేనేతపై ఆసక్తి కల్గిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో వెంకటగిరి పట్టణములో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కళాశాలలో మూడు సంవత్సరముల డిప్లమా కోర్సులతో నైపుణ్యం కలిగిస్తున్నామన్నారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 24వేలు ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోకి నేడు జమ చేశామన్నారు. సుమారు రూ. 41.3 కోట్లు నేతన్నలకు ఆర్థికసాయం అందడంతో చేనేత రంగం పుంజుకుంది అన్నారు. వెంకటగిరి నియోజకవర్గం ఇంచార్జి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 'మీరు నిజం – మీ మాట నిజం మీనాన్న వైఎస్ఆర్ ప్రజాసేవ చూసాం, ఇపుడు కనిపించే దైవంగా మీరు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు అమలు చేసి ప్రస్తుతం కనిపించే దైవంగా అందరికీ కనిపిస్తున్నారు' అని అన్నారు. ఆళ్తూరు పాడు ప్రాజెక్టుకు అనుమతులు , పోలేరమ్మ జాతర ను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని తదితరాలు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గుడివాడ అమర్నాథ్, తిరుపతి ఎంపి ఎం.గురుమూర్తి, డిఐజి అమ్మిరెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, ఎంఎల్‌సిలు పోతుల సునీత, కల్యాణ్ చక్రవర్తి, పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎంఎల్ఎ అనీల్‌కుమార్ యాదవ్, ఎంఎల్ఎలు సంజీవయ్య, ఆదిమూలం, వరప్రసాద్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, నెల్లూరు జడ్‌పి ఛైర్‌పర్సన్ అరుణమ్మ, మున్సిపల్ ఛైర్మన్ ధరణి పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఐదవ విడత వైయస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఘనంగా స్వాగతం, వీడ్కోలు పలికారు. రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం, వీడ్కోలు పలికిన వారిలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, టిటిడి బోర్డ్ మెంబర్ పొకల అశోక్ కుమార్ ఉన్నారు.

నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ

నేతన్నలతో కలిసి నేత నేస్తున్న సిఎం జగన్

రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం

సభకు హాజరైన జనం

ప్రతిపక్షాల గొంతునొక్కడ సరికాదు: సిపిఎం

వెంకటగిరి పట్టణంలో ముఖ్యమంత్రి సభ సందర్భంగా సిపిఎం నాయకులు వెంకటగిరి పట్టణ కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య తదితర వామపక్ష, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఓ ప్రకటనలో ఖండించారు. ప్రతిపక్షాల వామపక్షాల గొంతు నొక్కి నియంతగా పేరు తెచ్చుకోవడం ముఖ్యమంత్రికి తగదని పేర్కొన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ముఖ్యమంత్రి దష్టికి తేవడానికి ప్రయత్నించిన వారిని తెల్లవారుజాము నుండి గహ నిర్బంధం చేయడం శోచనీయమన్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ అప్రజాస్వామిక చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని తెలిపారు.

గృహ నిర్బంధంలో సిపిఎం నాయకులు చెంగయ్య

మున్సిపల్ కార్మికుల దీక్షలో ప్రసంగిస్తున్న వి.నాగరాజు

ఉదాసీన వైఖరి విడనాడాలి

రెండో రోజూ మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్/ సూళ్లూరుపేట

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభిస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు విమర్శించారు. శుక్రవారం తిరుపతి జిల్లా గూడూరు, సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయాల ఎదుట రెండో రోజూ నిరసన దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా వి.నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. గూడూరు మున్సిపల్ శాఖలో కాంట్రాక్టర్ మున్సిపల్ కార్మికులకు సక్రమంగా జీతాలను చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని దేశ అత్యున్నత న్యాయస్థానం అక్షింతలు వేసినా రాష్ట్ర ప్రభుత్వంలో స్పందన కరువయ్యిందన్నారు. కార్మికుల సమస్య పరిష్కరించని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని, చలో అసెంబ్లీకి వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, గోపీనీధ్, దారా కోటేశ్వరరావు, పెంచల ప్రసాద్, తాటిపర్తి రాఘవయ్య, యశోదమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండో రోజూ దీక్ష కొనసాగింది. ప్రతిపక్షంలో ఉన్నపుడు హామీలిచ్చిన జగన్మోహన్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

టిటిడి ఛైర్మన్‌గా జంగా కృష్ణమూర్తి?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎన్నికల వేళ 'బీసీ'లకు జగన్ సర్కార్ పెద్దపీట వేస్తోందన్న చర్చ నడుస్తోంది. ఇందులో భాగంగానే టిటిడి ఛైర్మన్ పదవిని ఈసారి జంగా క్రిష్ణమూర్తికి ఇస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిటిడి ఛైర్మన్‌గా వైవి సుబ్బారెడ్డి కొనసాగుతున్నారు. మొదటి విడత పదవీకాలం ముగిసిన తరువాత రెండోసారీ ఆయనే కొనసాగుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో త్వరలోనే సమీక్ష చేయనున్నట్లు తెలుస్తోంది. వైవి సుబ్బారెడ్డి స్థానంలో బీసీల్లో పట్టున్న, బీసీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షునిగా ఉన్న ఎంఎల్‌సి జంగా కృష్ణమూర్తిని నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. టిటిడి బోర్డు నియామకంపై సమీక్ష అనంతరం జగన్ తుది నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ప్రస్తుత బోర్డుకు ఆగస్టు 12న కాలపరిమితి ముగియనుంది.

జగన్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన జంగా కృష్ణమూర్తి 1999, 2004లో కాంగ్రెస్ తరపున గురజాల ఎంఎల్‌ఎగా పనిచేశారు. తరువాత టిడిపిలో కొంతకాలం ఉండి 2014 ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసి ఓడిపోయారు. తరువాత ఎంఎల్‌ఎ అయ్యారు. బీసీ సామాజికవర్గాల్లో జంగాకు పట్టుంది. రాబోయే ఎన్నికల్లో మొత్తం బీసీ సామాజికవర్గాన్ని వైసిపి వైపుకు లాగేయాలన్నది జగన్ ప్లాన్. అందుకే బీసీలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎన్ని పదవులు బీసీలకు ఇచ్చినా, టిటిడి ఛైర్మన్ పదవి అనేది ఓ రేంజిలో ప్రభావం ఉంటుంది. అందుకే ఛైర్మన్ పదవి జంగాకు ఇవ్వడం ద్వారా బీసీలకు తాను ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాననే విషయాన్ని చాటి చెప్పాలన్నది జగన్ వ్యూహం.

మహిళల నగ్న ఊరేగింపు దేశానికి అవమానం : ఐద్వా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కొర్లగుంటలో ఐద్వా నిరసన

మణిపాల్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశానికి జరిగిన అవమానంగా చూడకూడదని, అది దేశానికి జరిగిందని ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు జయంతి, డాక్టర్ పి.సాయిలక్ష్మి ఉద్ఘాటించారు. శుక్రవారం తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌లో ఐద్వా ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై ఎన్నో దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన రెజ్లర్లను ఎంపి బ్రిజ్‌భూషణ్‌సింగ్ లైంగికంగా వేధించారని రోడ్డుపై నిరసనలు చేసి, ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఆసిఫా ఘటన సందర్భంలోనూ దోషులకు అండగా నిలిచిందన్నారు. మణిపూర్ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం చూస్తుంటే ఇక్కడ కూడా దోషులకే అండగా నిలుస్తారన్న అనుమానం కలుగుతోందన్నారు. ప్రధాని మోడీ స్పందించి మణిపూర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దోషులను శిక్షించాలని, లేదంటే ఐద్వా ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పి. హేమలత, కోమలమ్మ, కాంతి, రాజు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. బాట గంగమ్మ ఆలయం వరకూ భక్తులు క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. సర్వ దర్శనం టోకెన్లు ఉన్న భక్తులు శ్రీవారిని దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రతికూల వాతావరణంలోనూ తిరుమలకు పోటెత్తుతున్నారు గురువారం 63,628 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తుల్లో 33,548 మంది భక్తులు స్వామివారికి తలనీలాలను సమర్పించుకున్నారు. మొక్కులను చెల్లించుకున్నారు. హుండీ ద్వారా 4.26 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందింది. 300 రూపాయల ప్రత్యేక దర్శనం టికెట్ల కోటా విడుదల తేదీని ఖరారు చేశారు. అక్టోబర్ నెలకు సంబంధించిన 300 రూపాయల శ్రీవారి ప్రత్యేక దర్శనం టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు.

ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో ఈ టికెట్లను అందుబాటులోకి తీసుకుని రానున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లో మాత్రమే భక్తులు దర్శనం టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.భక్తులు ఈ దర్శనం టికెట్లను టీటీడీ అధికారిక మొబైల్ యాప్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు. వసతి గదుల కోటాను ఆ మరుసటి రోజున అంటే జులై 26వ తేదీన ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఉదయం 10 గంటల నుంచి వసతి గదుల కోటా టికెట్లు అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ నెలలో సీనియర్ సిటిజన్లు/దివ్యాంగుల కోసం కేటాయించిన కోటా టికెట్లు ఒక రోజు ముందే అంటే ఈ నెల 25వ తేదీ నాడే విడుదల అవుతాయి. మధ్యాహ్నం 3:00 గంటలకు ఆన్‌లైన్‌లో ఈ టికెట్లు అందుబాటులోకి వస్తాయి. ఆయా టికెట్లన్నింటినీ కూడా అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని టీటీడీ అధికారులు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో హైదరాబాదుకు చెందిన న్యాయవాది శ్రీనివాసులు శుక్రవారం బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం ఇచ్చారు. తిరుమలలోని ఈవో బంగ్లాలో శుక్రవారం ఉదయం దాత ఈ విరాళం చెక్కును ఈవో ఏ.వి.ధర్మారెడ్డికి అందచేశారు. దాత గత నెలలో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందించారు. ఇందుకు గాను దాతను ఈవో అభినందించారు.

రవాణా శాఖ సభ్యులుగా సునీల్ చక్రవర్తి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర రవాణా శాఖ సభ్యులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముత్తంశెట్టి సునీల్ చక్రవర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది అక్టోబర్ వరకు సునీల్ చక్రవర్తి నాన్ అఫీషియల్ మెంబర్ గా కొనసాగనున్నారు.

శ్రీసిటీలో 'కెర్రీ ఇండేవ్' లాజిస్టిక్స్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - సత్యవేడు

భారతదేశంలోని ప్రముఖ ఇంటిగ్రేటెడ్ (థర్డ్ పార్టీ లాజిస్టిక్స్) సేవల సంస్థ కెర్రీ లాజిస్టిక్స్ నెట్‌వర్క్, శ్రీసిటీలో 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన తన నూతన అత్యాధునిక లాజిస్టిక్స్ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించింది. ప్రత్యేకంగా మిత్సుబిషి ఎలక్ట్రిక్ ఇండియా ఆపరేషన్స్ (ఏసీల వ్యాపారం) కోసం ఇది పనిచేయనుంది. పరిశ్రమ ఆవరణలో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలలో మిత్సుబిషి ఎలక్ట్రిక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) మసకాజు ఒబాటా నూతన కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నూతన ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి కెర్రీ లాజిస్టిక్స్, మిత్సుబిషి ఎలక్ట్రిక్ బందాలను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. కెర్రీ ఇండేవ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జి.మణికంఠన్ అతిథులకు స్వాగతం పలికి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రుచికరమైన ఆహారానికి కేరాఫ్...

విద్యార్థుల ఆకలి తీర్చే 'అన్నపూర్ణ' క్యాంటీన్

మా పిల్లలకు పెడుతున్నంత సంతోషం : తమ్మిరెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని అన్నపూర్ణ క్యాంటీన్ వేలాదిమంది విద్యార్థుల ఆకలి తీరుస్తూ, రుచికరమైన ఆహార పదార్థాలకు నిలయంగా ఉంటుందని క్యాంటీన్ నిర్వాహకులు తమ్మిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'తో తమ్మిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా క్యాంపస్‌లోనీ విద్యార్థినీ విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు, బోధనేతర సిబ్బందికి ఉదయం టీ, కాఫీలతో ప్రారంభమై సాయంత్రం టీ, కాఫీలతో ముగుస్తుందన్నారు.

ఉదయం క్యాంటీన్ లో వేడివేడిగా ఇడ్లీ, పూరి, ఉప్మా, పొంగల్, వివిధ రకాలైన దోశలు తయారు చేయడం తమ ప్రత్యేకతన్నారు. ఇందులోకి ఎర్రకారం, వేరుశెనగ చెట్ని, వివిధ రకాల కూరగాయలతో తయారు చేసే సాంబారు సిద్ధంగా ఉంచుతామన్నారు. అంతేకాకుండా ఉదయం పూట చేసే టిఫిన్ లోకి మసాలా వడలు, ఉద్ది వడలు, అరటి బజ్జీలు, మిరపకాయ బజ్జీలు తయారుచేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం సమయంలో అతి తక్కువ ధరలకే భోజనం, చిత్రాన్నం, లెమన్ రైస్, పులిహోార సిద్ధం చేస్తామన్నారు. ప్రతిరోజూ వేడి, వేడి పదార్థాలతో తయారుచేసిన భోజనం ఎంతోమందికి అతి తక్కువ ధరలకు అందించి సేవ చేయడం జరుగుతుందన్నారు. సాయంత్రం సమయాలలో బజ్జీలు, సమోసాలు, అరటికాయ బజ్జీలు వేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు, పరిశోధకులకు, బోధనేతర సిబ్బందికి ఉదయం సాయంత్రం రుచికరమైన చక్కని టీ, కాఫీ అందిస్తున్నామన్నారు. రుచికరమైన వంటలకు ఎస్వీయూ క్యాంపస్ లోని అన్నపూర్ణ క్యాంటీన్ అందరికీ అడ్డగా మారిందన్నారు. రుచికరమైన భోజనం అందించడం తన సామాజిక బాధ్యతగా చేస్తూ ముందుకు వెళున్నట్లు వెల్లడించారు. పరిశుభ్రమైన ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు, ఇతర సిబ్బందికి రుచికరమైన ఆహార పదార్థాలను అందించడమే లక్ష్యంగా, ధ్యేయంగా క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. రుచికరమైన భోజనం చేయాలంటే ఒక్కసారి ఎస్వీయూలోని అన్నపూర్ణ కాంటీన్ ని సందర్శించవలసిందె అని అన్నారు. ఇక్కడ చక్కని చిక్కటి పాలతో తయారు చేసినటువంటి టీ, కాఫీలు ఎంతో రిలాక్స్ గా పని చేసేందుకు స్వాంతనగా ఉంటుందన్నారు. ఎంతోమంది బయట వ్యక్తులకు, వర్సిటీలోని వివిధ విభాగాలకు క్యాటరింగ్ సౌకర్యాలను అందించడం జరుగుతుందన్నారు. అతి తక్కువ ధరలకే తమ వద్ద క్యాటరింగ్ సౌకర్యం ఉందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాణ్యమైన భోజనం సరసమైన ధరలకు అందించే ఏకైక ప్రాంతం ఎస్వీయూలోని అన్ని పూర్ణ క్యాంటీన్ మాత్రమేనని సగర్వంగా చెబుతున్నామన్నారు.

ఆంత్రోపాలజీ కోర్సుతో ఉన్నతావకాశాలు



ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆంత్రోపాలజీ కోర్సుతో విద్యార్థులకు ఉన్నత అవకాశాలు, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని విభాగాధిపతి ఆచార్య కె. సురేంద్రనాథ్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్షతో ఈ కోర్సులో ఎస్వీ యూనివర్సిటీలో సీటు సాధించవచ్చున్నారు. ఎస్వీయూలోని ఆంత్రోపాలజీ విభాగంలో కన్వీనర్ కోటా కింద 40 సీట్లు ఉన్నాయని, మేనేజ్మెంట్ కోటా కింద మూడు సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సులో చేరాలనుకునే ఆసక్తి కలిగిన విద్యార్థులు ఏపీ పీజీ సెట్ 2023 సంవత్సరంలో అర్హత పరీక్ష లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆంత్రోపాలజీ విభాగంలో చేరే అవకాశం ఉంటుందన్నారు. ప్రత్యేకమైన గ్రంథాలయ సౌకర్యం ఉందని, మానవ శిలాజాలకు సంబంధించిన పుట్టు పూర్వోత్తరాలు విశదీకరించే మ్యూజియం, ఇతర లాబోరేటరీ సౌకర్యాలు అత్యంత అధునాతనంగా రూపుదిద్దుకొన్నాయన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే యుజిసి నెట్, రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఏపీ సెట్, రాష్ట్రస్థాయిలో పరీక్షలైన గ్రూప్ 1, 2, సచివాలయం, డిగ్రీ కళాశాలలోని, ఇతర పోటీ పరీక్షలకు ఆంత్రోపాలజీ సబ్జెక్టు సంబంధించిన అంశాలు ఎన్నో వస్తున్నట్లు వెల్లడించారు. ఆంత్రోపాలజీలో పీజీ చేసిన విద్యార్థులకు పరిశోధన రంగంలోనూ, ఆంత్రోపాలజీకల్ సర్వే ఆఫ్ ఇండియా, జాతీయ ఆహార సంస్థ వంటి అనేక సంస్థలు పేరుగాంచిన జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పాటు ఎన్జీవో సంస్థలలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఉదాహరణకు డబ్ల్యూహెచ్‌వో, బిల్‌గేట్స్ ఫౌండేషన్, జిల్లాస్థాయిల్లో ఐటీడీఏ, ఐసీడీఎస్, డీఆర్డీఏ వంటి ప్రభుత్వ రంగ శాఖలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు.

గ్రామాల్లో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-కేవీబీపురం: పాతపాలెం, ఒల్లూరు గ్రామాల్లో శుక్రవారం ఉచిత వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ వాణి తెలిపారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యం కాపాడుకోవడానికి శ్రద్ధ తీసుకోవాలని.. తరచూ నీటిని తాగుతూ ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ 104 అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియ, సూపర్‌వైజర్ నాగరాజు, ఆశ కార్యకర్త శోభ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో రాస్ సంఘాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాస్ సంఘాలు చక్కటి ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేసుకుంటున్నారని తిరుపతి యూనియన్ బ్యాంక్ రీజినల్ అధికారి అహ్మద్ పేర్కొన్నారు. పుత్తూరు రాస్ కార్యాలయంలో టైలరింగ్, ఆర్య వర్క్‌పై ఉచిత శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం తిరుపతి నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన అహ్మద్ మాట్లాడుతూ చేతివృత్తులను ప్రోత్సహించి అందుకు అనుగుణంగా ఆర్థిక ఆదాయ కార్యక్రమాలను పెంపొందించుకుంటున్నారని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ అధికారి శ్రీహరి, రవి, తేజు, జయంతి, స్వాతి పాల్గొన్నారు.

షుక్రియా జగన్ సాబ్..!

ప్రజాశక్తి-గూడూరు: రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడేలా ఉంటే తప్పనిసరిగా ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) ని వ్యతిరేకిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మైనారిటీ ప్రతినిధులకు భరోసా కల్పించడంపై స్థానిక వైసీపీ మైనారిటీ నాయకులు కతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం వైసీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.మగ్దూమ్ మొహిద్దీన్ మైనారిటీ నాయకులతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మతపెద్దలు, పీఠాధిపతులు, మషాయఖీన్ అసోసియేషన్, ఉలమాలు, అన్ని జమాత్‌ల ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి భేటీ అయ్యారన్నారు. యూసీసీపై చర్చించారన్నారు. మూడున్నర గంటల సుదీర్ఘ చర్చల అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఇటువంటి చట్టాలను ఆంధ్రప్రదేశ్‌లో అనుమతించమని, ఇది ముస్లిం మైనారిటీల ప్రభుత్వమని చెప్పడంతో మరొక్కసారి ముస్లిం మైనారిటీలపై జగనన్న అండగా ఉంటారని నిరూపించారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన వైసీపీ ప్రభుత్వం ఇలాగే కలకాలం ప్రజల మన్ననలు పొందుతూ ఉండాలని మైనారిటీ నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేశారు. వైసీపీ యువ నాయకులు, ఈద్గా యూత్ అధ్యక్షుడు షబ్బీర్, రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జలీల్, యువత అధ్యక్షుడు బాబు, షబ్బీర్, యస్దాని, సందాని బాషా, నాజిని, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతేనే రాష్ట్ర భవిష్యత్తు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రజలందరి భవిష్యత్తు కోసం అనుభవశాలి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. అమెరికాలోని సియాటెల్ నగరంలో ఎన్ఆర్ఐ టీడీపీ-సియాటెల్ ఆధ్వర్యంలో తెలుగుదేశం అభిమానుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నానితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత నాలుగున్నర ఏళ్ల వైసిపి పాలనలో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. వారిని ఆదుకోవడానికి, వారి కష్టాలు తీర్చడానికి, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం ఎంతో అభివద్ధి చెందడంతో దేశ, విదేశాల్లో తెలుగువారు స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో ఎన్నారై తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రసాద్, జయప్రకాష్, హేమకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఎప్పటికో..!

- ఇంకా సిద్ధంకాని అర్హుల జాబితా
- ఆగస్టులో మంజూరంటున్న అధికారులు
- జాబితాలో ప్రతినెలా కోతలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: కొత్త పింఛన్లను ఏటా జనవరి, జులైలో ఇస్తామని సీఎం జగన హామీ ఇచ్చారు. అయితే ఏదో ఓ సాకుతో వాయిదా వేస్తున్నారు. ఏడాది కాలంగా ఈ హామీ అమలు కావడంలేదు. ఈ ఏడాదికి సంబంధించి కొత్త పింఛన్లు జులైలో ఇవ్వాల్సి ఉండగా.. ఆగస్టుకు వాయిదా వేశారు. అప్పుడైనా ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ప్రతి ఆరు నెలలకు ఓసారి పింఛన్ల జాబితాలో కొత్తవారిని చేరుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అర్హుల పేర్లను జాబితాలో చేర్చేందుకు నెల రోజులు ముందే గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సర్వే చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు పట్టించుకోలేదు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేవారు సర్టిఫికెట్ల కోసం ప్రయాస పడుతారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందేందుకు నెలల తరబడి ఎదురుచూస్తారు. వెబ్‌సైట్ పనిచేస్తుంటేనే వీటి కోసం దరఖాస్తు చేయాలి. ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణ చేయాలి. వైకల్యంతో ఇబ్బంది పడేవారికి ఈ ప్రక్రియ ప్రాణ సంకటంగా ఉంటుంది. ఇన్ని తిప్పలు పడి దరఖాస్తు చేస్తే.. జాబితాలో పేరు కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా నుంచి సుమారు 20 వేల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ప్రతి నెలా పింఛన జాబితా నుంచి సుమారు వెయ్యి మంది పేర్లను తొలగిస్తున్నారు. గడిచిన ఆరు నెలల్లో 4 వేల మంది పేర్లను తొలగించారు. కొత్తగా 9 వేల మందికి పింఛన ఇస్తామని ప్రకటించారు. ఈ లెక్కన.. జాబితాలోకి అదనంగా 4 వేల మంది మాత్రమే చేరుతారు. జాబితా నుంచి పేర్లను తొలగించడం, కొత్త పింఛన్ల చెల్లింపును వాయిదా వేయడం ప్రభుత్వ కుయుక్తి అని విమర్శలు వస్తున్నాయి. ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు ఇలా చేస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జాబి తాలో తమ పేరు ఉందో లేదో సరిచూసుకునేందుకు వద్ధులు, దివ్యాంగులు నిత్యం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

జులై జాబితాలో 2,73,496 మంది

జులై నెల పింఛన్ జాబితాలో జిల్లావాసులు 2,73,496 మంది ఉన్నారు. వీరికి రూ.76.417 కోట్ల నిధులు విడుదల చేశారు. లబ్ధిదారుల్లో వృద్ధులు 1,42,470 మంది, వితంతువులు 61,463 మంది, విభిన్న ప్రతిభావంతులు 41,226 మంది, చేనేతలు 6,758 మంది, ఒంటరి మహిళలు 6,720 మంది, అభయహస్తం 4,153 మంది, మెడికల్ 3,345, డప్పు కళాకారులు 2,754, ట్రెడిషినల్ కాబ్లెర్స్ 2,676, మత్స్యకారులు 838, సీకేడీయూ 368, కల్లుగీత కార్మికులు 327, హిజ్రాలు 198, కళాకారులు 194, సైనిక్ వెల్ఫేర్ ఆరుగురు ఉన్నారు. జులైలో మొత్తంగా 2,73, 496 మంది ఉండగా జూన్‌లో 2,74,128 మంది లబ్ధిదారులు ఉన్నారు. జూన్‌తో పోలిస్తే జులైలో అధికారికంగా 632 మంది లబ్ధిదారులు తగ్గారు. ప్రతినెలా ఇలా తగ్గుతూ వస్తోంది.

ఆగస్టులో కొత్త పింఛన్లు

ఆగస్టులో కొత్త పింఛన్లు వచ్చే అవకాశముంది. జనవరి నుంచి జూన్ వరకు వచ్చిన దరఖాస్తుల నుంచి అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపిక జాబితాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాలకు పంపుతారు. అక్కడ వెల్ఫేర్ అసిస్టెంట్ సర్వే చేసి నివేదిక ఇస్తారు. అర్హులకు ఆగస్టులో పింఛన్లు చెల్లిస్తారు. పూర్తి వివరాలు సెర్ఫ్ నుంచి రావాల్సి ఉంది.

- జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ, తిరుపతి

గంగజాతరలో బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రామాపురం పంచాయతీ అబ్బాబట్లపల్లి గ్రామంలో జరుగుతున్న జాతరలో శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి జాతరలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

23న చలో విజయవాడ

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రంలోని ఎస్టీ, ఎస్సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల రద్దు చేసినా రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 23న చలో విజయవాడకు సంబంధించి గోడ పత్రికను ఎస్వీయూలోని పరిపాలన భవనం ఎదుట ఎస్సీ, ఎస్టీ, గిరిజన సంఘాల నేతలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను రద్దు చేసినా రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక విధానాల నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ఎస్సి ఎస్టీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో విజయవాడ అంబేద్కర్ భవన్ లో సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు డా.ఎం.ప్రసాదరావు, జె.భాస్కర్, ఎం.త్యాగరాజు, మరియదాసు, గాలి సుధాకర్, కృష్ణమూర్తి, ఎస్.సుబ్రహ్మణ్యం, రఘు, గిరిజ, శివ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో చిన్నారికి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఓ చిన్నారికి ప్రమాదం తప్పింది. శుక్రవారం 3వ నంబర్ ఫ్లాట్‌ఫాంపై పిల్లర్‌లో ఇరుక్కున్న చిన్నారి సాయి యశస్వి(4) సుమారు గంటపాటు నరకయాతన అనుభవించింది. అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే అధికారులు శ్రమించి ఇనుప కట్టర్ల సహాయంతో పిల్లర్‌ని తొలగించి పాపని సురక్షితంగా బయటకు తీశారు. రాజంపేటకు చెందిన సాయికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి చిత్తూరుకు వెళ్లే క్రమంలో రేణిగుంట రైల్వే స్టేషన్లో దిగారు. రేణిగుంట నుంచి చిత్తూరుకు జయంతి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లేందుకు వేచి ఉన్న క్రమంలో పాప ఆడుకుంటూ పిల్లర్ స్తంభంలోపల ఇరుక్కుపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఉలిక్కిపడి అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు ఎంతో శ్రమించి బయటకు తీశారు. దీంతో అధికారులకు స్టేషన్ మాస్టర్ శేషగిరినాథ్‌రెడ్డి, జిఆర్‌పి ఎస్ఐ అనిల్ కుమార్, టిఎస్ఆర్ డిపార్ట్మెంట్ వర్కర్లు సురేష్, గురుదేవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ మహిళా నేతకు పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ 15వ వార్డుకు చెందిన వైసీపీ మహిళా నేత సాగీరాబీని శుక్రవారం బియ్యపు పవిత్రారెడ్డి పరామర్శించారు. సాగీరాబీ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బియ్యపు పవిత్రారెడ్డి తమ కార్యకర్తలతో కలసి ఆమె ఇంటికి వెళ్లారు. సాగీరాబీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈమె వెంట వైసీపీ నేతలు షర్మిల దాగూర్, ఫజల్, గోరా, అన్వర్ భాషా, జుమ్ లేషా తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-క్యాంపస్: మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, నెహ్రూ యువ కేంద్రం-చిత్తూరు సంయుక్తంగా నిర్వహించిన యువ ఉత్సవ్ 2023 జిల్లా స్థాయి పోటీలలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినులు తమ ప్రతిభ కనబరిచారు. విజేతలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజిని, ప్రొఫెసర్ డి కాత్యాయని డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ , ప్రొఫెసర్ సైలేశ్వరి కల్చరల్ కోఆర్డినేటర్ అభినందించారు.

జగనన్న సురక్షతో అందరికీ సమన్యాయం

ప్రజాశక్తి-కోట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలందరికీ సమన్యాయం చేకూర్చడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని.. పేదలకు నేరుగా ధ్రువపత్రాలు అందిస్తున్నామని కోట తహశీల్దారు పద్మావతి అన్నారు. శుక్రవారం కోటలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి తహశీల్దారు చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందించారు. అనంతరం బాలికల పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాళెం పంచాయతీ పరిధిలో ఎంపీడీవో భవాని ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. పంచాయతీ కార్యదర్శి ఎన్.రాజశేఖర్, సీనియర్ నాయకులు శానంపూడి గోపాల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతాయని.. జగనన్న సురక్ష కార్యక్రమంతో అందరికీ న్యాయం జరుగుతుందని నారాయణపురం పంచాయతీ వైసీపీ ఇన్‌ఛార్జి గోపిగౌడ్ అన్నారు. శుక్రవారం నారాయణపురం సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులైన వారికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పఠాన్ రఫీఖాన్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే తండ్రి బియ్యపు గోవింద్ రెడ్డి, గుంటకిందపల్లి సర్పంచ్ పెంచలమ్మ, సచివాలయ కన్వీనర్ మునికృష్ణయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహానికి నిత్యావసర వస్తువుల పంపిణీ

తిరుపతి టౌన్ : తిరుపతి లయన్స్ క్లబ్బు ప్రెసిడెంట్ బి .మునికష్ణ నాయుడు ఆధ్వర్యంలో తిరుపతి, జీవకోన ,క్రాంతి నగర్ , నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్య విద్యాలయం (బాలికల వసతి గహం) బాలికలకు క్లబ్బు సభ్యులు లయన్ లోకేష్ బాబు తండ్రి ఇ.గురు స్వామి నాయుడు వర్ధంతి పురస్కరించుకొని నిత్యావసర సరుకులు, విద్యాసామగ్రి తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మునికష్ణ నాయుడు మాట్లాడుతూ లోకేష్ బాబు తన తండ్రి వర్ధంతి కార్యక్రమాన్ని పేద పిల్లల మధ్య జరుపుకోవడం చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు . ఈ కార్యక్రమానికి దాత లయన్ లోకేష్ బాబు. క్లబ్బు కార్యదర్శి ముబారక్ భాషా ,ట్రెజరర్ వినోద్ వెంకటాచలం. సభ్యులు: రాజేంద్రప్రసాద్, ఎమ్మార్ రాజా ,మేరీ, సాకం కృష్ణమూర్తి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కడప నగరంలోని యూటీఎఫ్ భవనంలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరుగనున్న పీడీఎస్ యూ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు, జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని ఆ యూనియన్ డివిజను కార్యదర్శి ముబషీర్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులకు యూనియన్ సభ్యులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ప్రశాంత్, గురువ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఈనెల 22, 23 తేదీలలో కడప నగరంలో యుటిఎఫ్ భవనంలో నిర్వహిస్తున్నట్లు పిడిఎస్‌యూ తిరుపతి జిల్లా కార్యదర్శి జాకీర్ వెల్లడించారు. శిక్షణ తరగతులకు సంబంధించి గోడపత్రికను శుక్రవారం ఎస్వీయూలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్, ప్రశాంత్, గురువ్య పాల్గొన్నారు.

జనసేన ఆదరణ చూసే సీఎం విమర్శలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీకి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిసారి పవన్ కళ్యాణ్ వివాహాల గురించి ప్రస్తావించడం వైసిపి నీచ రాజకీయాలకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు హాజరైన సభలో ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి జగన్ పవన్ పెళ్లిళ్ల గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌పై ఎవరైనా విమర్శలు చేస్తే ఇకపై ఊరుకోమని హెచ్చరించారు.

వెంకటగిరి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా గౌరవ పదవిలో ఉండి దిగజారి మాట్లాడటం సరికాదని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వర్లు శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. వెంకటగిరి పట్టణం నుండి ఐదో విడత నేతన్న నేస్తం సాయం ఐదో విడత విడుదల చేయడానికి వచ్చిన ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాక్యలు చేయడం సరి కాదన్నారు. ప్రజా సొమ్ముతో ఎక్కడ సమావేశాలు ఏర్పాటు చేసినా పవన్ కళ్యాణ్ చేసుకున్న పెళ్లిళ్ల గురించి మాట్లాడటం తప్ప రాష్ట్ర అభివద్ధి గురించి పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో వీర మహిళ చాముండి రాధమ్మ, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రామారావు, అనిల్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి శ్యాంసుందర్

ప్రజాశక్తి తిరుచానూరు:

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ శైలేంద్ర బాబు, ఏ.ఈ.ఓ. రమేష్, సూపరింటెంట్ శేషగిరి, ఆలయ ఇన్స్పెక్టర్ ప్రసాద్ అశోక్, గణేష్ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమ సేవలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆదర్శనీయం.. రామచంద్రారెడ్డి సేవలు

ప్రజాశక్తి-తిరుచానూరు: ప్రజల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారం చూపే నాయకుల వరుసలో ముందుండే నాయకుల్లో తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఒక్కరు. ఆయన తిరుచానూరు, దామినేడు ఆలయ నిర్మాణాలు చేయించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. ధార్మిక చింతన కలిగిన ఆయన ప్రతి శనివారం పేదలకు అన్నదానం చేస్తూ వారి కడుపులు నింపుతున్నారు. ఆయన సర్పంచిగా.. దాతగా ఆయన చేస్తున్న సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి. నిత్యం ఇటు వైసీపీ పార్టీకి, ప్రజలకు తన సహాయ సహకారాలు అందిస్తున్న రామచంద్రారెడ్డికి నాయకులు, తిరుచానూరు గ్రామస్థులు నేడు పుట్టినరోజు వేడుకలు శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రీడాకారిణి వైష్ణవికి క్రికెట్ కిట్ వితరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి పేద కుటుంబానికి చెందిన ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారిణి వైష్ణవి ఆరు నెలల కాలంలోనే అండర్-15 రాష్ట్ర జట్టుకు.. చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. వైష్ణవి ప్రతిభను చిల్లీస్ హోటల్ అండ్ రెస్టారెంట్స్ ఫౌండర్ మధుమోహన్ రావు, చిల్లీస్ అధినేత అంజి గుర్తించి ఆమెను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని చిల్లీస్ హోటల్ అండ్ రెస్టారెంట్స్ సమావేశ మందిరంలో క్రికెట్ క్రీడాకారిణి వైష్ణవికి ప్రోత్సాహ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో కనకనరసారెడ్డి హాజరయ్యారు. పేద కుటుంబానికి చెందిన వైష్ణవి ప్రతిభను గుర్తించి చిల్లీస్ ఫౌండర్ మధుమోహన్‌రావు చిల్లీస్ అధినేత అంజి వైష్ణవిని ప్రోత్సహించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం వైష్ణవిని అభినందించారు. వైష్ణవికి ఇంటర్నేషనల్ క్రికెట్ క్రీడా కిట్ ను అందజేశారు. కార్యక్రమంలో చిల్లీస్ అంజి మిత్రులు చేజర్ల మురళి, సతీష్, రాజు, కష్ణ, ఢిల్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

'బీటీఆర్ కాలనీని అభివృద్ధి చేస్తాం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని రణధీరపురం(బిటిఆర్ కాలనీ) గ్రామ పంచాయతీని మరింతగా అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తామని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అన్నారు. శుక్రవారం రణధీరపురం గ్రామ పంచాయతీలో గడపగడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎమ్మెల్యేగా పంచాయతీలో అభివృద్ధి పనులు చేశారన్నారు. పంచాయతీ ఇన్‌ఛార్జి పీఎం లక్ష్మీనారాయణ, మండల వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, సర్పంచ్ పి.లీలావతి, ఉప సర్పంచి మల్లెమొగ్గల ఉమాపతి, వైసిపి మంగళం డివిజన్ అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి, వార్డు మెంబర్లు మురళి, సతీష్, కుమారి, నాగమణి, భూదేవి, అనార్కలి, నాయకులు తుంటి సుదాయాదవ్, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేసే ప్రతిఒక్కరూ నేతన్న కాదు..!

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గడిచిన ఐదు సంవత్సరాలలో చేనేత రంగం కుదేలు అయిందని, నేసే ప్రతిఒక్కరిని నేతన్నగా ప్రభుత్వం గుర్తించడంతో చేనేత కుటుంబాలు రాష్ట్రవ్యాప్తంగా ఆర్థికంగా కుదేలు అయ్యాయని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నకు ఇదివరకు సబ్సిడీలు చేతివత్తుల పనిముట్లు చేనేత గ్రూపు ద్వారా బ్యాంకు రుణాలను అందించే వారిని, ఇప్పుడు వాటన్నింటినీ రద్దు చేస్తూ ఏడాదికి రూ.24 వేలు ఇస్తే నేతన్న కుటుంబం గడుస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావించడం అర్థ రహితమన్నారు. నేడు నిత్యావసర వస్తువులు, ముడి సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో నేతన్న తన స్వీయ శక్తిపై ఎలా ఆధారపడి కుటుంబాలను పోషించాలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ఉంటే బాగుండేదని తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్షపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-క్యాంపస్: స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్ లో ఆదివారం ఉదయం 10 గంటలకు 2024 విద్యా సంవత్సరంలో జాతీయస్థాయిలో జరగబోయే నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగహన సదస్సు నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డా.ఎన్.విశ్వ నాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తలిదండ్రులు హాజరై ఈ పోటీ పరీక్ష వివరాలు, సందేహాలను నివత్తి చేసుకోవచ్చని అన్నారు. వివరాలకు 9399976999 / 8688888802 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దళితుల భూముల జోలికొస్తే ఊరుకోం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వాలు మారినా పేదల తలరాతలు మారడం లేదని, దళితులకిచ్చిన భూములు కర్పూర హారతులా కరిగిపోతున్నాయని జై భీమ్ వ్యవస్థాపకుడు, మాజీ సైనికుడు పులి శ్రీకాంత్ వాపోయారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలోని గుంట కింద పంచాయతీ మద్దిలేడు రోడ్డు పక్కనే ఉన్న సుమారు 5 ఎకరాలు ఆన్‌లైన్‌లో పేర్లు మార్చడం జరిగిందని, అర్హులైన దళితుల వద్ద అన్ని ఆధారాలున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని వాపోయారు. సర్వేనెంబర్ 8/3లో రెండు ఎకరాల 98 సెంట్లు భూమిపై బత్తెయ్య కు 1996 సంవత్సరంలో దరఖాస్తు పట్టా పుస్తకం ఇచ్చారని చెప్పారు. అప్పటినుంచి ఆ ఆస్తిని కాపాడుకుంటూ వస్తున్నాడనీ, కుమారులు, రాబోయే రోజుల్లో పిల్లల భవిష్యత్తుకు అండగా నిలుస్తుందన్న తరుణంలో రెండు రోజుల క్రితం కొంతమంది వ్యక్తులు రాత్రికి రాత్రి చదును చేసి నేడు అక్రమ కట్టడాలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికీ రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తమ గోడు చెబితే 2007 లోనే వేరే పేరుపై మారిందని చెప్పడంతో నివ్వెరపోవడం బత్తెయ్య కుటుంబ సభ్యులదయిందని వాపోయారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని, దళితుల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.